క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

రాజానగరం: సంపత్‌నగరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ వార్షిక మరమ్మత్తుల నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎస్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. ఈ నేపథ్యంలో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకూ జి.యర్రంపాలెం, కొండగుంటూరు, భూపాలపట్నం, పుణ్యక్షేత్రం, సంపత్‌నగరం, నామవరం గ్రామాలకు సరఫరా ఉండదు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు శిక్ష

పెదపూడి: నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారికి జైలు శిక్ష, జరిమానా విధించారు. ఎస్సై శోభన్‌కుమార్ సోమవారం తెలిపిన వివరాలు ప్రకారం పెదపూడిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా నలుగురు వ్యక్తులు మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్నారు. వారిపై కేసు నమోదు చేయగా కాకినాడ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఒకరికి రెండు రోజులు జైలు శిక్ష, మరో ముగ్గురికి ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున జరిమానా విధించారన్నారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ఘనంగా గ్రంథపాలకుల దినోత్సవం



బహుమతులు పొందిన విద్యార్థులతో అధ్యాపకులు

రాజానగరం: గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో సోమవారం జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం నిర్వహించారు. గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ 132వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

హర్ ఘర్ తిరంగాపై అవగాహన ర్యాలీ

పెదపూడి: అనపర్తిలో ఆజాది కా అమృత్ మహోత్సవంలో భాగంగా హర్ ఘర్ తిరంగా అవగాహన ర్యాలీ సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ర్యాలీలో పాల్గొన్నారు. స్వతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. దీనిలో భాగంగా ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో అనపర్తి కెనాల్ రోడ్డులో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం నుంచి మహాత్మా గాంధీ బొమ్మ సెంటర్ వరకు జాతీయ జెండాలతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనపర్తి మండలం రామవరంలో నల్లమిల్లి మూలారెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పంచాయతీరాజ్‌శాఖ, ఐటీసీ ఆధ్వర్యంలో సుమారు రూ.9.50 లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు.

పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని వినతి

రాజానగరం: మండలంలోని కొత్తతుంగపాడులో పారిశుధ్యం అధ్వానంగా మారిందంటూ ఆ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు యాళ్ల మాచరయ్య ఆధ్వర్యంలో గ్రామస్తులు సోమవారం కలెక్టర్ పి.ప్రశాంతికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి స్థానికంగా లేకపోవడమే దీనికి ప్రధాన కారణమన్నారు. వాస్తవాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులకు పోటీలు



బహుమతులు అందుకున్న విజేతలు

రాజానగరం: స్వాతంత్య్ర సంబరాలలో భాగంగా మండలంలోని ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. తోకాడలోని విశ్వజ్యోతి ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో ఈ పోటీలు జరిగాయి. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు సీనియర్, 6, 7 తరగతుల విద్యార్థులకు జూనియర్, 3, 4, 5 తరగతుల విద్యార్థులకు సబ్ జూనియర్ విభాగాలలో పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

కడియం: మండలంలోని జేగురుపాడులో సారా విక్రయిస్తున్న జె.పద్మావతిని అరెస్టు చేసినట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ తెలిపారు. ఆమె నుంచి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చామన్నారు.

వేతన వేదన

- ప్రభుత్వాస్పత్రిలో సెక్యూరిటీ సిబ్బంది అవస్థలు
- ఐదునెలలుగా రాని జీతాలు
- పట్టించుకోని కాంట్రాక్ట్ సంస్థ

సీటీఆర్ఐ: వారందరూ సెక్యూరిటీ విధులు నిర్వహించే ప్రైవేటు కార్మికులు. రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రి, వైద్య కళాశాల వద్ద నిత్యం విధులు నిర్వహిస్తున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులతో పాటు కళాశాలకు వచ్చే వారికి అన్ని విధాలా రక్షణగా ఉంటారు. కానీ ఈ ప్రైవేటు రక్షకులకు మాత్రం ఉద్యోగ భద్రత లేదు. ప్రతి నెలా జీతం పడదు. అప్పులు చేసుకుంటూ, అర్ధాకలితో జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న 55 మంది, ప్రభుత్వ మెడికల్ కాలేజీలో విధులు నిర్వహిస్తున్న 20 మంది సెక్యూరిటీ కార్మికులు వేదన ఇది.

వివరాలు ఇవీ..

రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రి, మెడికల్ కళాశాలలో దాదాపు 70 మంది పురుషులు, మహిళలు సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్నారు. వీరందరూ షిఫ్టుల వారీగా రాత్రీ పగలు విధులు నిర్వహిస్తారు. 15 సంవత్సరాల క్రితం వరకూ ప్రభుత్వమే వీరికి జీతాలు ఇచ్చేది. ఆ తరువాత ప్రైవేట్ యజమాన్యానికి కాంట్రాక్టుగా ఇచ్చేశారు. దీంతో వీరందరూ ప్రైవేట్ సెక్యూరిటీ సర్వీస్ కిందకు వెళ్లిపోయారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వాలు బిల్లులను ప్రతి నెలా సక్రమంగా చెల్లించినా కాంట్రాక్ట్ సర్వీసులు మాత్రం వీరికి జీతం ఇవ్వడం లేదు. ఈ కార్మికులకు కాంట్రాక్ సంస్థ ఇచ్చే జీతం కేవలం రూ.9200, ఇది కూడా ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి.

నాలుగు నెలలకు ఒక్కసారి..

ప్రభుత్వ ఆసుపత్రిలో సెక్యూరిటీ కాంట్రాక్ట్‌ను కరోనాకు ముందు భీమవరానికి చెందిన స్కాట్ లాండ్ సెక్యూరిటీ సర్వీస్ సంస్థ దక్కించుకుంది. అప్పటి నుంచి వారే కార్మికులకు జీతాలు చెల్లిస్తున్నారు. కానీ అది ప్రైవేట్ సంస్థ కావడంతో కార్మికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదు. విసిగిపోయిన కార్మికులు ధర్నా చేస్తే ఒక్క నెల జీతం ఇస్తున్నారు. అంటే దాదాపు నాలుగు నెలలకొకసారి ఒక నెల జీతం వారికి చెల్లిస్తున్నారు.

ఈ నెలాఖరుతో కాంట్రాక్ట్ పూర్తి

స్కాట్‌లాండ్ సెక్యూరిటీ సర్వీస్ సంస్థ ఆధ్వర్యంలో సెక్యూరిటీ కార్మికులు పనిచేస్తున్నారు. వీరందరికీ ఆ కంపెనీయే జీతాలు చెల్లించాలి. దీనితో పాటు పీఎఫ్ కూడా కట్టాలి. అయితే గత కొన్ని నెలలుగా కార్మికులకు పీఎఫ్ కట్టడం లేదు. అంతే కాకుండా ఐదు నెలలు బకాయిలు ఉన్నాయి. సెక్యూరిటీ సంస్థ గడువు కూడా ఈ నెలాఖరుతో ముగియనుంది. దీంతో తమకు రావాల్సిన జీతాలు, పీఎఫ్ కట్టకుండా వెళ్లిపోతారని సెక్యూరిటీ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. గతంలో ఈగల్ సంస్థ కూడా ఈ విధంగా చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

వారం రోజులుగా ధర్నా

ఈ నేపథ్యంలో సెక్యూరిటీ సిబ్బంది విధులకు హాజరవుతూనే విరామం సమయంలో ధర్నా నిర్వహిస్తున్నారు. కానీ అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో సోమవారం హోంమంత్రి అనిత దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లడం కోసం ఆసుపత్రి ధర్నా నిర్వహించారు. దీనితో పోలీసులు అక్కడకు చేరుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ధర్నా విరమించాలని, తాము కాంట్రాక్టర్‌తో మాట్లాడతామని ఆసుపత్రి సూపరింటెండెంట్ హామీ ఇవ్వడంతో సెక్యూరిటీ సిబ్బంది ధర్నాను విరమించారు.



ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

పస్తులుంటున్నాం



జీతాలు సక్రమంగా రాకపోవడంతో అప్పులు చేస్తున్నాం, అవి దొరకనప్పుడు పస్తుంటున్నాం. 20 ఏళ్లుగా సెక్యూరిటీ కార్మికుడి పనిచేస్తున్నాను. మా యూనియన్ తరఫున సూపరింటిండెంట్‌కు వినతి పత్రం కూడా అందించాం. అనుకున్న విధంగానే సోమవారం ధర్నా చేపట్టాం. అధికారులు హామీతో విరమించుకున్నాం. వారం రోజుల్లో జీతాలు రాకపోతే మళ్లీ ధర్నా చేస్తాం.

– ములగడ ప్రసాదరావు, యూనియన్ అధ్యక్షుడు

చార్జీలకే సరిపోతున్నాయి



ఇతర ప్రాంతాల నుంచి పని చేయడానికి ఇక్కడకు వస్తున్నాం. రోజుకు దాదాపు రూ.60 వరకూ చార్జీలు అవుతున్నాయి. రెండు, మూడు నెలలకోకసారి ఒక నెల జీతం వేస్తున్నారు. ఆ డబ్బులన్నీ చార్జీలకే సరిపోతున్నాయి. దీంతో అప్పులు చేసుకుని బతుకుతున్నాం. ఇప్పటికైనా మా జీతాలు మాకు ఇప్పించాలి.

– సుశీల, సెక్యూరిటీ సిబ్బంది

పీఎఫ్ కట్టడం లేదు



సీనియర్ సెక్యూరిటీ సిబ్బందికి ఐదు నెలలు నుంచి కాంట్రాక్టర్ పీఎఫ్ కట్టడం లేదు. సీనియార్టీ తక్కువున్న వారికి అసలు పీఎఫ్ సౌకర్యమే లేదు. కానీ మాకిచ్చే జీతాలలో పీఎఫ్ కోసం డబ్బులు కట్ చేస్తున్నారు. సెక్యూరిటీ సంస్థ కాంట్రాక్టు ఈనెలాఖరుకు అయిపోతుంది. ఆ తర్వాత మా పీఎఫ్ డబ్బులు, జీతాలు రావు. అందుకోసమే ధర్నా చేస్తున్నాం.

– చిలకల నాగేశ్వరరావు, సెక్యూరిటీ సిబ్బంది

నిబంధనలు పాటించకుంటే చర్యలు



అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

కంబాలచెరువు: నగరంలో నిత్యం ట్రాఫిక్‌తో రద్దీగా ఉండే కూడళ్లను సోమవారం ఎస్పీ డి.నరసింహ కిషోర్ పరిశీలించారు. పెరిగిపోతున్న ట్రాఫిక్ కారణంగా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లుకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేష్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు ఉన్నారు.

నేటి నుంచి న్యాక్ బృందం పర్యటన

కంబాలచెరువు: స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళ, బుధవారాల్లో న్యాక్ బృందం పర్యటించనుందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎబిల్ రాజబాబు తెలిపారు. ఆ బృందంలో ఫకర్ మోహన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ మధుమిత దాస్ చైర్ పర్సన్‌గా, విద్యాసాగర్ విశ్వవిద్యాలయం కామర్స్ ఆచార్యులు బ్రడ్జిబలవ్ పాల్ కోఆర్డినేటర్‌గా, ఎస్‌సీఎంకేవీ మహావిద్యాలయ ప్రధాన ఆచార్యులు డాక్టర్ మంగళ యశ్వంత్ మిశ్రా మెంబర్‌గా ఉంటారన్నారు. కళాశాలలోని అన్ని డిపార్ట్‌మెంట్లు, ఫ్యాకల్టీ, విద్యార్థులు, కళాశాల ప్రగతి తదితర విషయాలను పరిశీలిస్తారన్నారు.

శిక్షణ తరగతులు ప్రారంభం

రాజానగరం: మండలంలోని గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు (గ్రేడ్ ఒకటి నుంచి ఐదు వరకు) స్థానిక మండల ప్రజా పరిషత్ మీటింగ్ హాలులో మూడు రోజుల పాటు ఇచ్చే శిక్షణా తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జీఎస్‌ఏ) కార్యచరణ ప్రణాళికలో భాగంగా పరిసరాల పరిశుభ్రత, చెత్త నుంచి సంపద తయారీ, పంచాయతీల అభివృద్ధికి కార్యాచరణ, వీధి దీపాలు తదితర అంశాలపై శిక్షణా ఇవ్వనున్నారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే ఈ శిక్షణకు కోర్సు డైరెక్టర్‌గా ఎంపీడీఓ జ్యోతిర్మయి, అసిస్టెంట్ కోర్సు డైరెక్టర్‌గా సూపరింటిండెంట్ సుబ్రహ్మణ్యం, మాస్టర్ ట్రైనర్లుగా పాత తుంగపాడు, తోకాడ పంచాయతీ కార్యదర్శులు వీఎస్ మూర్తి, జీవీవీఎస్‌కే ప్రసాద్, సహాయకుడిగా వి.మహేష్‌సాయి పృథ్వీనాథ్ వ్యవహరిస్తున్నారు. శిక్షణకు ఎంపీపీ మండారపు సీతారత్నం, జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, మండారపు వీర్రాజు తదితరులు హాజరయ్యారు.



శిక్షణకు హాజరైన సర్పంచ్‌లు, కార్యదర్శులు

పంచాయతీ పాలనపై అవగాహన అవసరం

పెదపూడి: గ్రామ పంచాయతీ పరిపాలన, అభివృద్ధి పనులు, గ్రామాభివృద్ధి ప్రణాళికలపై గ్రామ సర్పంచులు, సచివాలయం కార్యదర్శులు అవగాహన పెంచుకోవాలని ఎంపీపీ కేతా తులసి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్పంచులు, సచివాలయం కార్యదర్శులకు మూడు రోజులపాటు పునశ్చరణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ చట్టాలు, ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీ, వీధిలైట్ల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పంచాయతీ రాజ్ కమిషనర్ ఉత్తర్వులపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. స్టేట్ రిసోర్స్ పర్సన్స్ ఈఓపీఆర్డీ ఎం సత్యానారాయణరెడ్డి, పీఎస్ నాగేంద్ర, ప్రసన్న, లక్ష్మీనారాయణ, వేణుగోపాల్ తదితరులు పంచాయతీ హక్కులు, బాధ్యతలు, చట్టాలపై వివరించారు. ముందుగా డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేస్తానని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పి.ఆశా జ్యోతి, ఏఓ చలమయ్య పాల్గొన్నారు.



సర్పంచులు, కార్యదర్శుల శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీపీ కేతా తులసి

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

మధురపూడి: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా సర్పంచ్‌లు, కార్యదర్శులు పనిచేయాలని కోరుకొండ ఎంపీడీఓ వేముల సుందరరావు అన్నారు. కాపవరంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమంపై శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎంపీడీఓ సుందరరావు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ బి.మహేశ్వర ప్రతాప్ పాల్గొన్నారు.

విద్యార్థి ఉన్నత విద్యకు ఆర్థిక సహకారం

రంగంపేట: ప్రతిభ ఉన్న విద్యార్థికి పేదరికం అడ్డురాకూడదని ఆ విద్యార్థి ఉన్నత విద్యకు ఆర్థిక సహకారం అందించి విద్యా దాతగా నిలిచారు అనపర్తి శ్రీచక్ర ఆయిల్స్ అధినేత చింతా గోపాలకృష్ణారెడ్డి. రంగంపేట మండలం జి.దొంతమూరు గ్రామానికి చెందిన గల్లా రమాదేవి పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. ఈ అమ్మాయి చిన్నతనం నుంచి చదువులో రాణించి ఉత్తమ ఫలితాలు సాధిస్తోంది. పేద కుటుంబానికి చెందిన ఆమె సీఏ చదువుకి కళాశాల ఫీజు మొత్తం చెల్లించే బాధ్యత తాను తీసుకుంటానని సోమవారం అనపర్తిలో చింతా గోపాలకృష్ణారెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతిభ ఉన్న విద్యార్థులకు ఆర్థిక సహాయం, వికలాంగులకు, కృత్రిమ అవయవాలు, చెవిటి మెషీన్లు, కరోనా వంటి పరిస్థితుల్లో ఎంతో మందికి భోజన సదుపాయం తదితర సేవా కార్యక్రమాలు తమ సంస్థ ద్వారా అందిస్తామన్నారు. రానున్న రోజుల్లోనూ ప్రతిభ ఉన్న విద్యార్థుల చదువుకు అండగా ఉంటానని ఆయన అన్నారు.



విద్యార్థి రమాదేవితో విద్యాదాత గోపాలకృష్ణారెడ్డి

దైవ నామస్మరణతో మానసిక ప్రశాంతత

రంగంపేట: నిరంతర దైవ నామ స్మరణతో మానసిక ప్రశాంతత కలుగుతుందని, జీవితాన్ని చరితార్థం చేసుకోవడానికి ప్రతి ఒక్కరూ సాధన చేయాలని సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కందర్ప వెంకటఅమర్‌నాథ్ సూచించారు. మండల పరిధిలోని కోటపాడు సత్యసాయి సేవా సదన్ 29వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన ప్రశాంతి పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ బాబా సూచించిన సమాజ సేవా సూక్తులు ఆచరించి జీవితాలను ధన్యం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బాబా చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు. అనంతరం సామూహిక పూజలు, 99 భజన పాటల కార్యక్రమాన్ని నిర్వహించారు. సేవాదళ్ సభ్యులు, బాల వికాస్ గురువులు, విద్యార్థులు, యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బాబా చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

రోప్ స్కిప్పింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బిక్కవోలు: మండలంలో పందలపాక గ్రామంలోని శ్రీ పడాల పెద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు హెచ్ఎం శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 10,11 తేదీల్లో కర్నూలు జిల్లా గార్గేయపురంలో నిర్వహించిన 7వ రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ క్రీడా పోటీలో అండర్ 17 ,అండర్ 14 బాలుర సింగిల్ రోప్ డబుల్ అండర్ సైక్లింగ్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మూడు బంగారు, ఏడు కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో అండర్ 14 విభాగంలో ఎ.యశ్వంత్, ఎస్ సాయి, అండర్ 17 విభాగంలో ఎం.భరత్, ఎన్ సతీష్, బి దుర్గాప్రసాద్, ఎం.విజయ్, ఎస్ ప్రేమ్‌కుమార్, ఆర్ రాకేష్, జి సత్యదేవా, బి మనోజ్ పాల్గొన్నారని తెలిపారు. క్రీడాకారులను వారి శిక్షణ ఇచ్చిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ద్వారంపూడి యువరాజారెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలోని పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కొనాల సత్తి రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పందలపాకలో క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వికలాంగులకు కృత్రిమ కాళ్లు అందజేత

కంబాలచెరువు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు సోమవారం గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ముగ్గురు వికలాంగులకు కృత్రిమ కాళ్లను అందజేశారు. అనంతరం జాతీయ లోక్ అదాలత్‌పై నిర్వహించిన సమావేశంలో న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ సెప్టెంబర్ 14వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక మొత్తంలో సివిల్ కేసులు, చెక్ బౌన్స్, రాజీయోగ్యమైన క్రిమినల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. బాధితులకు తగిన పరిహారం అందించేందుకు తీసుకోవాల్సిన విధివిధానాలను తెలిపారు. ఈ మేరకు పెండింగ్‌లో ఉన్న ఆయా సంస్థల సివిల్, కాంపౌండబుల్ క్రిమినల్ కేసుల జాబితాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలన్నారు. అనంతరం గౌరవ 9వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.మాధురి, కార్పొరేషన్, విద్యుత్, కార్మిక, బ్యాంకు ప్రతినిధులతో సమావేశమయ్యారు.

పని సర్దుబాటు బహిష్కరణ

కంబాలచెరువు: ఫాప్టో సూచనలను పరిగణలోకి తీసుకోకుండా 117, 128 జీవోల ఆధారంగా చేస్తున్న పని సర్దుబాటును బహిష్కరించాలని రాష్ట్ర ఫాప్టో పిలుపునిచ్చింది. దీనిలో భాగంగా రాజమహేంద్రవరం నగర సభ్య సంఘాలు అర్బన్ డీఐ బి.దిలీప్ దిలీప్ కుమార్ కలిసి సోమవారం మెమొరాండం ఇచ్చాయి. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ 1938 తరఫున ఎ.ఉదయ బ్రహ్మం, కె.డేవిడ్ లివింగ్‌స్టన్, ఎస్‌టీయూ నుంచి విశ్వేశ్వరరావు, డీఎస్ఎస్.మూర్తి, యూటీఎఫ్ నుంచి జి.అప్పారావు, నరేష్, ఎంటీఎఫ్ నుంచి కెనడీ బాబు పాల్గొన్నారు.

వితంతువులకు పింఛన్లు సక్రమంగా అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాష్ బాబు

రాజానగరం: వితంతువులకు సామాజిక పింఛన్లను సక్రమంగా అందించడం ఒక సేవగా భావించాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి ప్రకాష్ బాబు అన్నారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో వితంతు పింఛన్ల పంపిణీ, లబ్ధిదారుల ఎంపిక విధానం పై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక ప్రగతిని సాధించాలన్నారు. సామాన్యులకు న్యాయపరమైన సాయం అందించడానికి డీఎల్ఎస్ఏ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మండారపు సీతారత్నం, జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, ఐసీడీఎస్ సీడీపీఓ కె.నాగమణి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, వితంతు మహిళలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి పరామర్శ

పెదపూడి: కాండ్రేగుల గ్రామ శివారు గుబ్బలవారి పాలెంకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త వాసంశెట్టి శ్రీను ఇటీవల అనారోగ్యంతో కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శ్రీనుతోపాటు ఆయన కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సోమవారం పరామర్శించారు. మెడికల్ రిపోర్టులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే వెంట కాండ్రేగుల ఎంపీటీసీ సభ్యుడు పేపకాయల వెంకటరమణ, కట్టా విజయరాజు, నాయకులు పాల్గొన్నారు. రంగంపేటలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాలాటి నాగేశ్వరరరావు భార్య (మాజీ రాష్ట్ర చేనేత కార్పొరేషన్ డైరెక్టర్) అమ్మాజీ ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఆమెను మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. కంటిపూడి నాగేశ్వరరావు, గారపాటి వెంకటరావు, యర్రమాటి సత్తిబాబు, ఆళ్ల దుర్గారావు, పసల్ల జానకి రామ సుర్యారావు, కంటే సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.



కాకినాడ ఆస్పత్రిలో వాసంశెట్టి శ్రీనును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

‘ప్రియదర్శిని’లో గుడ్‌ఫ్రెండ్స్ చారిటీ సేవలు

కంబాలచెరువు: స్థానిక మున్సిపల్ కాలనీలోని ప్రియదర్శిని ఆశ్రమంలో సోమవారం గుడ్‌ఫ్రెండ్స్ చారిటీ సభ్యులు సేవలందించారు. ఆ గ్రూపు అడ్మిన్ మండవల్లి సుజాత ఆధ్వర్యంలో ఆశ్రమంలోని 150 మంది చిన్నారులకు భోజనం అందించారు. చిన్నారి విహాన్ పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రూపు సభ్యులు వందనకుమార్, మండవల్లి సుజాత, ప్రభ మాట్లాడుతూ ఆకలితో ఉన్నవారి కడుపునింపే దిశగా గుడ్‌ఫ్రెండ్స్ చారిటీ ముందుకెళుతోందన్నారు. తమ సేవలు రానున్న రోజుల్లో మరింత విస్తృతం చేస్తామన్నారు. ఆశ్రమ నిర్వాహకురాలు స్వప్నవర్మ మాట్లాడుతూ సేవామార్గంలో ముందుకువెళుతున్న గుడ్‌ఫ్రెండ్స్ చారిటీ మున్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రిన్సిపాల్ ఆశాలత, ప్రత్యేక ఉపాధ్యాయులు ప్రేమలత, నిర్మల, ప్రియాంక, సునీత పాల్గొన్నారు.



చిన్నారులకు అన్నం వడ్డిస్తున్న గుడ్‌ఫ్రెండ్స్ చారిటీ సభ్యులు

సూర్య హోటల్‌పై కేసు నమోదు



వంట గదిలో తనిఖీ చేస్తున్న అధికారులు

కంబాలచెరువు: ఏవీ అప్పారావు రోడ్డులోని సూర్య హోటల్‌పై విజిలెన్స్, ఫుడ్‌సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు సోమవారం దాడి చేశారు. సాధారణంగా వంటనూనె టీపీసీ రేటింగ్ 25 శాతం దాటకుండా ఉండాలి. కానీ ఆ హోటల్లో 39.5 టీపీసీ నమోదైంది. అలాగే కాలం చెల్లిన ఆహారపదార్థాలు ఉండడంతో కేసు నమోదు చేశారు. విజిలెన్స్ ఎస్పీ కేవీఎస్‌వీ సుబ్బారావు మాట్లాడుతూ తమ తనిఖీల్లో కాలం చెల్లిన కేజీన్నర కాన్‌డైడ్ పప్పయ్య టూటూ ఫ్రూటీను గుర్తించామన్నారు. వంటనూనె టీపీసీ రీడింగ్ 39.5 శాతం నమోదు కావడంతో కేసు నమోదు చేశామన్నారు. హోటల్‌లోని చికెన్ ఫ్రైపీస్ బిర్యానీ శాంపిల్‌ను నాణ్యతా పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపామని తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్సై టి.జగన్నాథరెడ్డి, ఏవో జె.భార్గవమహేష్, తహసీల్దార్ కె.విజయ్‌కుమార్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వి.రుక్కయ్య, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ సాల్మన్‌రాజు, వీరబాబు, లోవరాజు పాల్గొన్నారు.

ల్యాబ్‌లలో తనిఖీ



ల్యాబ్‌లో తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శ్రీహరిబాబు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): నగరంలోని లూసిడ్, విజయా డయాగ్నోస్టిక్ ల్యాబ్‌లలో ఆరోగ్యశాఖాధికారులు సోమవారం తనిఖీలు చేశారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో ఎం.శ్రీహరిబాబు, సిబ్బంది ఈ తనిఖీలు చేపట్టారు. రేట్ల పట్టికను ప్రదర్శించడంలో నిర్లక్ష్యం వహించిన ఆ ల్యాబ్‌లకు నోటీసులు జారీ చేశారు.

ఉద్యోగుల న్యాయమైన కోర్కెలు నెరవేర్చాలి

రాజమహేంద్రవరం సిటీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల న్యాయపరమైన కోర్కెలు వెంటనే నెరవేర్చాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ అసిస్టెంట్ డివిజన్ సెక్రటరీ కె.విజయ కుమార్ అన్నారు. రాజమహేంద్రవరం సౌత్ సెంట్రల్ మజ్దూర్ యూనియన్ బ్రాంచిల ఆధ్వర్యంలో పర్మినెంట్ వే, మెమూ కార్ షెడ్ కార్యాలయాల ఎదుట సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం దిగిరాకపోతే ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ నిరవధిక సమ్మె చేస్తారన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్, మెకానికల్ బ్రాంచ్‌లకు చెందిన ఉద్యోగులు శ్రీనివాసరెడ్డి, జగన్నాథరావు, జయరాం, బాబు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న రైల్వే మజ్దూర్ యూనియన్ సభ్యులు